

అభివృద్ధి సంఘం చైర్మన్‌గా 'కందూరి'

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర పాలఏకిరి, ఏకిల, వ్యాకుల, నాయనివారు, పాలెగారు, తోలగారి, కవర సంక్షేమ, అభివృద్ధి సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా సంబేపల్లెకు చెందిన కందూరి నాగేశ్వరరావును మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా నాగేశ్వర నాయుడు మాట్లాడుతూ పార్టీ స్థాపించడం నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, 2013లో సర్పంచ్, పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశానన్నారు. 2024లో రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి గెలుపునకు కృషి చేశానని తెలిపారు. సంబేపల్లి మండల నాయకుడిగా ప్రజలకు అందుబాటులో ప్రజా సేవ చేస్తున్నానని చెప్పారు. తన సేవలు గుర్తించి తెలుగుదేశం పార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని, తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



చెదురుమదురు సంఘటనలు మినహా..
'ఉప' పోరు ప్రశాంతం

- ఒంటిమిట్ట, పులివెందుల్లో హై..టెన్షన్
- పులివెందులలో టిడిపి స్వైరవిహారం
- ఒంటిమిట్టలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బెదిరింపులపై నిరసన
- ఎంపీ, టిడిపి ఎమ్మెల్సీ అరెస్టు, విడుదల
- కడప ఎంపీ కార్యాలయానికి డిఐజి, ఎస్‌పి
- పులివెందులలో 76.44 , ఒంటిమిట్టలో 70.33 శాతం పోలింగ్





ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు



విభిన్న ప్రతిభావంతురాలిని వీల్‌చైర్ సాయంతో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు



ఒంటిమిట్ట రాచపల్లి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



ఓటు వేసేందుకు వస్తున్న విభిన్నప్రతిభావంతుడు



పులివెందులలో అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ఉద్రిక్త వాతావరణం మధ్య ముగిశాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో కడప జిల్లా అధికార యంత్రాంగం మంగళవారం ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పకడ్బందీ పోలీసు బందోస్తు మధ్య నిర్వహించింది. పులివెందులలో 76.44, ఒంటిమిట్టలో 70.33 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్‌కు ముందే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అరెస్టు, మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ ఎస్.వి.సతీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. కడప, ఎర్ర గుంట్ల పట్టణ ప్రాంతాలకు తరలించారు. ఎంపీ ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా బైఠాయించారు. ఒంటిమిట్ట, పులివెందుల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో బెదిరింపులు, దొంగఓట్లు, ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలు, నిరసనలు, బైఠాయింపులు, టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వివాదాలతో ఉద్రిక్త నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని వైసిపి జిల్లా నాయకులను అదుపులోకి తీసుకోవడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. పులివెందుల పరిధిలోని మోట్నూతలపల్లి, ఎర్రిపల్లి, కణంపల్లి గ్రామాల్లో టిడిపి దౌర్జన్యాలకు, దారుణాలకు పాల్పడింది. ఓటర్ల దగ్గర నుంచి స్లిప్పులను లాక్కుని ఓట్లు వేసుకుంది. జిల్లాలోని జమ్మలమడుగు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు దొంగఓట్లకు పాల్పడ్డారు. ఒంటిమిట్ట పోలింగ్ బూత్‌లోని వైసిపి ఏజెంట్‌పై దాడులు, దౌర్జన్యాలు, బూత్‌లో ఇరు పార్టీల కార్యకర్తల మోహరింపుతో కొంతసేపు పోలింగ్ నిలిచి పోయింది. చిన్నకొత్తపల్లి బూత్‌లో వైసిపి ఏజెంట్‌పై టిడిపి దాడికి పాల్పడ్డారు. సాలాబాద్, నడింపల్లి, మంటపంపల్లి, చింతరాజుపల్లి పంచాయతీ గుండ్లపల్లి పోలింగ్ బూత్‌లో వైసిపి, టిడిపి ఏజెంట్లు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలింగ్ పర్యవేక్షణకు వచ్చిన జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వైసిపి అభ్యర్థి ఇరగంరెడ్డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఏజెంట్లను, వివరికి తనను సైతం బెదిరించి, అప్రజాస్వామిక ఎన్నికలకు కారణమయ్యారని వివరించారు. రీపోలింగ్ నిర్వహించాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన చేశారు. చిన్నకొత్తపల్లి బూత్ పరిశీలన అనంతరం వెళ్తున్న మంత్రిని స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంధించి మంత్రి స్థాయిలో ఉంటూ ఇటువంటి అప్రజాస్వామిక వైఖరేమిటని నిలదీశారు. అనంతరం వైసిపి జిల్లా నాయకత్వం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కడప-తిరుపతి రహదారిపై బైఠాయించింది. ట్రాఫిక్ స్తంభించింది.

పులివెందులలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. ఈ ఎన్నికను తెలుగుదేశం, వైసిపి రెండూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నిక విన్నర్...విన్నర్‌గా మారింది. మంగళవారం తెల్లవారుజామున ఎంపీ అవినాష్‌రెడ్డిని, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కడపకు తరలించారు. పులివెందులకు వచ్చిన ఎంపీ అవినాష్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలని కర్నూల్ రేంజ్ డిఐజి ప్రవీణ్, ఎస్‌పి అశోక్‌కుమార్ కోరారు.

ఎక్స్‌ట్రాలు చేస్తే కాళ్లు విరగ్గొడతా : డిఎస్‌పి

ఎక్స్‌ట్రాలు చేస్తే కాళ్లు విరగ్గొడతానంటూ వైసిపి కార్యకర్తలకు పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు ఎంపీ అవినాష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. తర్వాత ఎంపీ పులివెందులలోని తన కార్యాలయంలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ అవినాష్‌రెడ్డిని కలిశారు. భద్రతా కారణాల దృష్ట్యా వైసిపి కార్యకర్తలను ఆఫీసు ఖాళీ చేయాలంటూ డిఐజి ఆదేశించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ వైసిపి కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు వైసిపి కార్యకర్తలైతే తనది ఖాకీ యూనిఫామ్ అని, ఎక్స్‌ట్రాలు చేస్తే కాళ్లు విరగ్గొడతానంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రశాంతంగా ఎన్నికలు : డిఐజి

జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించామని డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలు పరిశీలించామని చెప్పారు. ఎక్కడ ఎటువంటి సంఘటన చోటు చేసుకోలేదన్నారు. కణంపల్లెలో 20 మంది మహిళలను దగ్గరుండి ఓటు వేయడానికి పంపించామని పేర్కొన్నారు. రిగ్గింగ్ జరిగినట్లు ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ఉప ఎన్నికల్లో ఓటర్ల దగ్గర స్లిప్పులు లాక్కొని టిడిపి గుండాలే ఓట్లు వేశారని, ఇవి చెత్త ఎన్నికలు అని, కర్నూలు రేంజ్ డిఐజి ప్రవీణ్, ఎస్‌పి అశోక్ కుమార్ టిడిపి కార్యకర్తలుగా వ్యవహరించాలని, ఎన్నికల జరిగిన విధానంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఎంపీ అవినాష్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌కు రావాలని డిఐజి తన కార్యాలయానికి వచ్చి కోరారని పేర్కొన్నారు. తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఒక లేఖలో సంతకం పెట్టమని అడిగారన్నారు. ఆ లేఖలో పోలీసులు ఎన్నో అసత్యాలు రాశారని అందుకు తాను సంతకం పెట్టడానికి నిరాకరించానని చెప్పారు. కణంపల్లెలో ఓటర్లు కాళ్లు పట్టుకున్నా అధికారులు ఓటు వేయనీయలేదని చెప్పారు.



పులివెందులలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

టిడిపి పతనానికి నాంది : వైసిపి

వేంపల్లె : పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిని వేంపల్లెలో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజల హక్కులను కాపాడే అధికారులే మౌనంగా వహించడం శోచనీయమని, ఈ ఎన్నికలు టిడిపి పతనానికి నాదన్నారు. పులివెందుల నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు వేల సంఖ్యలో వచ్చి ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో తిష్ట వేసి అ గ్రామస్తులనే భయభ్రాంతులకు గురిచేస్తుంటే అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహించడం శోచనీయమని వాపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులను కాపాడే బాధ్యత పోలీసులు, కలెక్టర్, జిల్లా అధికారులపై ఉందన్నారు.

రీపోలింగ్ నిర్వహించాలని ఎంపీ అవినాష్ ధర్నా

ఎర్రగుంట్ల: పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని దొంగ ఓట్లు వేశారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి కడపకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి ఎర్రగుంట్లకు తరలించారు. నిడిజివ్విలోని సుధీర్‌రెడ్డి నివాసానికి ఎంపీ అవినాష్‌రెడ్డి వెళ్లారు. అక్కడి నుంచి ఉదయం 10:30 సమయంలోఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వరకు ఐదు కిలోమీటర్ల మేర ఎంపీతోపాటు కార్యకర్తలు, నాయకులందరూ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా కూడలిలో ఎంపీ మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉపఎన్నిక పోలింగ్ బూతులలో తమ ఏజెంట్లను కూడా కూర్చొని ఇవ్వలేదన్నారు. పోలీసులందరూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, జడ్‌పిటిసి బాలయ్య పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : ధర్నా చేస్తున్న ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి

ఓటు హక్కు కల్పించండి

జడ్‌పిటిసి ఉప ఎన్నికల సంబంధించి అచ్చవెల్లి, ఎర్రిపల్లె, కనంపల్లి, ఇతర గ్రామస్తులు తమకు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును కల్పించాలని ఎన్నికల అధికారికి వినతి పత్రం అందించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ఎఆర్ఒ కృష్ణమూర్తికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు, పోలీసులు అడ్డుకుని తమ ఓటు వారే వేశారని ఓటు హక్కు కల్పించాలని వినత పత్రంలో పేర్కొన్నారు. తిరిగి రీపోలింగ్ నిర్వహించాలన్నారు. ఇతర మండలాల నాయకులు వచ్చి దొంగ ఓట్లు వేశారని ఎంపీ అవినాష్‌రెడ్డికి కూడా తమగోడును విన్నవించుకున్నారు.

40 ఏళ్లల్లో ప్రజల ఓటుకు స్వేచ్ఛ : మంత్రి సవిత

పులివెందుల రూరల్: వైసిపి హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచిందని, ప్రస్తుతం రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కొనసాగుతోందని, 40 ఏళ్ల పులివెందుల చరిత్రలో కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల ఉప ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి లేని పోనీ ఆరోపణ చేయడం అర్థ రహితమన్నారు. ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం కణంపల్లిలో వైసిపి గుండాలు టిడిపికి చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేసి కార్యకర్తలను గాయాల పాలు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో టిడిపి తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్త చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పేర్ల పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు.

రెండు స్థానాలు టిడిపివే : మంత్రి మండిపల్లి

కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలను టిడిపి కైవసం చేసుకుంటుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడపలోని ఓ హోటల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము ప్రజలను కోరామని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం తెలంగాణకు వెళితే, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు జడ్‌పిటిసి స్థానాలు గెలిచి సిఎంకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. టిడిపి కార్యకర్తకు ఆపద వస్తే పార్టీ తరపున తాము ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు చూడని గ్రామాలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాయని పేర్కొన్నారు. విజయం సాధించడం తథ్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కాయని ఇళ్ల వద్దకు పోయి బెదిరించాలని, ఏజెంట్లుగా కూర్చోకుండా భయపెట్టారని చెప్పారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా టిడిపి విజయం సాధ్యమని తెలిపారు.



వేంపల్లె : ఇడుపులపాయ పోలీసుస్టేషన్‌లో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పోరాడి సాధించుకోవడం అభినందనీయం

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి -రాయచోటి అర్బన్

ఆశావర్కర్లు ప్రభుత్వంపై పోరాటం చేయడం ద్వారా గ్రాట్యూటీ, మెటర్నిటి లీవులను సాధించుకోవడం అభినందనీయం అని సిఐటియు అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు, కోశాధికారి హరిశర్మ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జులై 9 దేశ వ్యాప్తంగా ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పోరాటాలతో కదం తొక్కి ప్రభుత్వాల మీద ఒత్తిడి పెంచి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను, రిట్మైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంపును సాధించు కున్నారన్నారు. ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్టంగా రూ. 1,50,000 గ్రాట్యూటీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 94ను విడుదల చేయడం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సాధించిన గొప్ప విజయంగా తెలిపారు.

ప్రధాని మోడీ గద్దె దిగాలి : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ వెంటనే రాజీనామా చేసి గద్దె దిగిపోవాలని, విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ బయట పెట్టిన ఓట్ల దొంగతనం మీద సుప్రీంకోర్ట్ సిట్టింగ్ జడ్జిల చేత విచారణ జరిపించాలన్నారు. అంబేద్కర్ పౌరులకిచ్చిన ఓటు హక్కును బిజెపి దొంగతనం చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు 300 మందికి పైగా ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. దొంగఓట్లను సృష్టించడంలో బిజెపి, ఎలక్షన్ కమిషన్ ప్రమేయం పట్ల అనుమానాలు ఉన్నాయని, ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న అధికారులను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్లతో గెలిచిన ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి, బాలెట్ పేపర్‌తో ఎన్నికలు జరపాలన్నారు. పౌరుల హక్కులను కాలరాస్తున్న ఓట్ల దొంగతనంపై ప్రజలందరూ స్పందించాలని కోరారు. సమావేశంలో విసికె పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు జి.గంగులప్ప, వై.గంగాధర్, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

మన్ననలు పొందడమే నిజమైన గుర్తింపు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రజల నుంచి మన్ననలు పొందడమే చేసిన సేవలకు సరైన గుర్తింపు అని రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఫయాజ్ ఫంక్షన్‌హాల్లో ట్రాఫిక్ సిఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న విశ్వనాథ రెడ్డికి వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తెరిగి వాటి కనుగుణంగా విధులను నిర్వర్తించడం గొప్ప విషయం అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించడంలో విశ్వనాథరెడ్డి సమర్థవంతంగా పనిచేశారన్నారు. విద్యార్థులకు, యువకులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. చట్టాలపై అవగాహనతో పాటు వాటిని వాటిని ప్రజలు పాటించేలా చేయడం ద్వారానే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమైంది అన్నారు. అనంతరం అర్బన్ సిఐ బి.వీ. చలపతి, రూరల్ సిఐ వరప్రసాద్, లక్కిరెడ్డిపల్లి సిఐ కొండారెడ్డితో పాటు పలువురు వక్తలు ట్రాఫిక్ నియంత్రణలో విశ్వనాద్ రెడ్డి సేవలను కొనియాడారు. పలు వురు పురప్రముఖులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది బదిలీపై వెళ్తున్న విశ్వనాథరెడ్డికి శాలువలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు.

ఉద్యోగుల సమస్యలు చర్చించుకుందాం

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగుల సమస్యలను టీ తాగుతూ చర్చించుకుందాం అని ఎపిజిఎ జల్లా అధ్యక్షులు డాక్టర్ డి. పేర్కొన్నారు. మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో టీ తాగుతూ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 5 నుండి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు. గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, అరియర్స్, డిఎను ఇవ్వలేదని వాపోయారు. 3 సంవత్సరాల సరెండర్ లీవ్స్ పెండింగ్ ఉన్నాయిన్నారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు మనకెందుకని నూతనంగా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వాణిజ్య శాఖ రాష్ట్ర మహిళా కార్యదర్శి హైమావతి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. కరీమ్, రాయచోటి తాలూకా అద్యక్షులు సాయికుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని నల్లగుట్టపల్లి హౌసింగ్ లేఅవుట్, వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన సహాయాన్ని ఇళ్లను కట్టుకునే వారికి అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి తీసుకురావాలని, గ్రామ పంచాయతీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయతీ సెక్రటరీని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఏమైనా ఖాళీలు ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసుకొని 100 శాతం చెత్త సేకరణ జరగాలని ఎంపిడిఒ, పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఒ రాధమ్మ, ఎంపిడిఒ జాషువా, నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ కృపావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఇఆర్ఒలు పాల్గొన్నారు.



వ్యర్థ పదార్థాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

జాతీయ ఐక్యతను చాటాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్క భారతీయ పౌరుడూ జాతీయ సమగ్రత, జాతీయ ఐక్యత చాటుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అజాది కా అమృత్ మహోత్సవ్‌లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం భాగంగా రాయచోటి కలెక్టరేట్ నుంచి బంగ్లా సర్కిల్ వరకు జిల్లా పర్యాటక శాఖ, ప్రభుత్వ వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా డివిజన్, మండల కేంద్రాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు పాల్గొన్న విధంగా చూడాలని అన్నారు. దేశస్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపడానికి గుర్తుగా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. సమాజంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, డిపిఒ రాధమ్మ, రాయచోటి తహాశీల్దార్ నరసింహాకుమార్, జిల్లా పర్యాటక శాఖ నాగభూషణం, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మిగిలిన సీట్లను భర్తీ చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5, 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 38 మిగులు సీట్లు ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ గ్రేడ్-2లో మూడు సీట్లు, ఎస్సీ గ్రేడ్-3కి 20 సీట్లు, పదో తరగతిలో ఎస్సీ గ్రేడ్-3కి 7 సీట్లు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎస్సీ గ్రేడ్-2కి 5 సీట్లు, ఎస్సి గ్రేడ్-3కి 2, ఒసికి ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీలు పాఠశాల కార్యాలయాలన్ని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, కలకడ వేణుగోపాల్, బోనాసి జాన్ బాబు,బీదం గురునాథ్ యాదవ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న డిఎఒ శివనారాయణ

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

రైతులు సాగుచేసిన పంటలను రైతు సేవ కేంద్రం సిబ్బంది ఇ-క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులు సాగుచేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్న పథకాలు రాయితీలు రైతులకు వర్తించాలంటే సాగు చేసిన పంటలను ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరామి మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి, జిల్లా వ్యవసాయ సాంకేతిక అధికారి నవంత్, జిల్లా రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలికిరి

దళితుల సమస్యలను పరిష్కరించాలని సిఐ అనిల్ కుమార్‌కు ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హరి ఆధ్వర్యంలో దళిత సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. కలికిరి సిఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్‌ను దళిత సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ కార్యదర్శి చంద్రయ్య, రాయల సీమ ఉపాధ్యక్షులు గుండా మనోహర్, మాల మహానాడు కార్యదర్శి మల్లెల మోహన, జిల్లా అధ్యక్షులు శివయ్య, ఈశ్వర్ గౌడ్, సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామాల్లోని ప్రజలు 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మనోజ్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనంతం పల్లె గ్రామం రామాలయం దగ్గర పేద ప్రజలకు అందుబాటులో 104 వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మెరుగైన వైద్యం సోమతిని వారికి కూడా 104 వాహనం ద్వారా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. రోగికి చికిత్సతో పాటు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలలో రెండుసార్లు 104 వాహనం అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 67 రోగులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిబ్బంది దగ్గర దాదాపు 150 మంది రోగులు చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. రోగికి అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి పంపించడం జరుగుతుందని అన్నారు. బిపి, షుగర్, యూరిన్ టెస్ట్ మొదలగునవి చేస్తున్నామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగజ్యోతి ఎఎన్ఎం సరస్వతి, ఆశా వర్కర్ రాధమ్మ, రమణమ్మ గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆధార్ కేంద్రం మంజూరు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలానికి నూతనంగా మరో ఆధార్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని నిర్వాహకులు మనోహర్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ నెల్లూరు వారి ద్వారా నిమ్మనపల్లెలో ఇప్పటికే ఆన్ లైన్ సేవలను నిర్వహిస్తున్న సోమేష్ ఆన్‌లైన్ సేవా కేంద్రానికి నూతనంగా ఆధార్ సేవ కేంద్రాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు నూతన ఆధార్ కార్డులకు, ఆధార్ కార్డులలో ఫోటోలు, చిరునామా వంటి వివరాల మార్పు చేర్పులకు తమ ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. మండలంలో ప్రభుత్వం తరఫున తహశీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఉండగా, ప్రయివేట్ సోమేష్ ఆన్ లైన్ సేవ కేంద్రానికి నూతనంగా మరో ఆధార్ సేవ కేంద్రాన్ని మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు తమ ఆధార్ సేవలను పొందటానికి ఇప్పుడు మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

'సజ్జల'ను కలిసిన బావాజీ


ప్రజాశక్తి-కలికిరి: మాజీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణ రెడ్డిని వైసిపి మండల ఉపాధ్యక్షుడు వేంపల్లి బావాజీ తాడేపల్లి లోని వైసిపి కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మండల రాజకీయ పరిస్థితులను గురించి ఆరా తీశారని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. మండల స్థాయి, నియోజక వర్గ స్థాయిలో చేపట్టిన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో యువతను ముందుకు తీసుకువెళుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారని అన్నారు.

డాక్టర్ రంగనాథ్‌కు నివాళులు

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవపల్లిలో శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఉదయం గ్రంథాలయ జాతిపితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రవిశంకర్‌రాజు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్ అగ్రగామి అని కొనియాడారు. కార్యక్రమంలో మండి మారయ్య, రాజు, రవి, మునయ్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన గీతాంజలి విద్యార్థిని

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చీరాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో గాలివారిపల్లిలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.బి ఆయిషా అండర్-18 బాలికల విభాగంలో డిస్కస్ త్రో అథ్లెటిక్స్ లో ప్రథమ స్థానం సాధించిందని కళాశాల ప్రెసిడెంట్ ఎన్.వి రమణ తెలిపారు. డిస్కస్‌త్రోలో రాణించిన విద్యార్థినికి కళాశాలలో శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


ఆయిషాను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

NAME CHANGE

నేను కల్లు రమేష్, తండ్రి పేరు కల్లు నారాయణస్వామి, తపాలా చిరునామా: డోర్ నం.1-168, బజారు వీధి, చెంబకూరు గ్రామం, రామసముద్రం మండలం, అన్నమయ్య జిల్లా. నా పేరును కల్లు రమేష్ నుండి కలలు రమేష్ గా మార్చుకున్నాను. ఇకముందు కల్లు రమేష్ అనే పేరును వాడను. నా కొత్త పేరు కలలు రమేష్ గా అన్ని రికార్డుల్లో సవరించవలసిందిగా కోరుచున్నాను.

NAME CHANGE

నేను కల్లు శైల కుమారి, భర్త పేరు కె. రమేష్, తపాలా చిరునామా: డోర్ నం.1-168, బజారు వీధి, చెంబకూరు గ్రామం, రామసముద్రం మండలం, అన్నమయ్య జిల్లా. నా పేరును కల్లు శైల కుమారి నుండి కలలు శైలకుమారిగా మార్చుకున్నాను. ఇకముందు కల్లు శైల కుమారి అనే పేరును వాడను. నా కొత్త పేరు కలలు శైల కుమారిగా అన్ని రికార్డుల్లో సవరించవలసిందిగా కోరుచున్నాను.

ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ వహించాలని డిపిఎం బి.వెంకట మోహన్ పేర్కొన్నారు. మండలంలోని మండల వ్యవసాయ కార్యాలయం నందు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిబ్బంది పనితీరుని సమీక్షించారు. అనంతరం బోజ్జావారిపల్లిలోని రైతుల పొలాలను పరిశీలించారు.ప్రకృతి సిబ్బంది చేస్తున్నటువంటి మోడల్స్‌ను పరిశీలించారు. అందులో ముఖ్యంగా ఏ గ్రేడ్ పిఎండిఎస్, ఎటిఎం మోడల్స్‌ను పరిశీలించారు, రైతులతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. రైతులందరూ ప్రకృతి సిద్ధమైన వ్యవసాయాన్ని చేసే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. **రామాపురం :** వర్షాధార పంటలుగా పప్పు ధాన్యాల పంటలు సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి నాగమణి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా హసనాపురం పంచాయతీలోని కొండవాండ్లపల్లి చెందిన నాగేందర్ రెడ్డి పది ఎకరాల పొలంలో పప్పు ధాన్యాల పంటను సాగు చేశారు. ప్రధానంగా కంది, అలసంద, అనప, పెసర, ఆముద పంట ఐదు రకాల పప్పుధాన్య పంటలు సాగు చేశారు. పంటలకు కావాల్సిన జీవామృతం చెరువులో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ సూచనలు, సలహాలతో చిరుధాన్య పంటలు సాగు చేశారు. ఎఒ మాట్లాడుతూ ఇలాంటి పంటలు సాగు చేయడం వల్ల 365 రోజులు భూమి పచ్చగా కప్పబడి ఉంటుందన్నారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిఆర్‌పి వెంకటరామిరెడ్డి, కదిరున్నిసా, రెడ్డమ్మ పాల్గొన్నారు. **నిమనపల్లి :** వరి పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారిణి మంజుల తెలిపారు. వెంగంవారిపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేయు రైతులకు వరిలో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంపై వ్యవసాయ సహాయకులతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని, వరి నాట్లలో కాలిబాటలను వదలాలన్నారు. లైన్ షోయింగ్ పద్ధతులను పాటించడం వలన గాలి, వెలుతురు సరిపడా మోతాదులో పంటకు అందుతుందని, తద్వారా పంట ఎదుగుదల బాగుంటుందని అన్నారు. వరినాటు సమయంలో, కలుపుతీత సమయంలో ఎరువలను తగిన మోతాదులో వాడాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


నిమ్మనపల్లి : వరిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మంజుల

నులిపురుగుల నియంత్రణతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సానే శేఖర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుల్లో రాణిస్తారని మండల విద్యాశాఖ అధికారి రెడ్డిశేఖర్ పేర్కొన్నారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న 230 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ ఏస్దని మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాలు లోపం,ఆకలి మందగించటం,నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు,బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆయన చెప్పారు.అల్బెంజోల్ మాత్రలు వేయడం ద్వారా రక్త హీనత నివారణ, పోషకాలు గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు, సిఎంఆర్‌టి శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** డిప్యూటీ డిఎంహెచ్ఒ సానే శేఖర్, స్థానిక వైద్యాధికారి మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో అనంతంపల్లె జడ్‌పిహైస్కూల్, జానకిపురం అంగన్వాడీ కేంద్రం, ఎస్‌బివిడి సభ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1-5 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో, 6-9 సంవత్సరాలలోపు పిల్లలు పాఠశాలల్లో ఈ మాత్రలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసుగల పిల్లలు 7025 మంది ఉండగా 6837 మంది పిల్లలకు మాత్రలు మింగించి 98శాతం నమోదు కావడం జరిగిందని తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు కలకడ, ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్యాధి కారి మల్లికార్జున, ఇమ్మానుయేల్ తెలిపారు. కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4979 మంది చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయవలసి ఉండగా 4792 మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేసి 96 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్యంద్రం పరిధి నందు1052 చిన్నారులకు మాత్రలు పంపిణీ చేయవలసి ఉండగా 1011 మంది చిన్నారు లకు మాత్రలు పంపిణీ చేసి 96శాతం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలకడ ఎర్రకోటపల్లి వైద్యాధికారులు మోహన్, జవహర్ బాబు, సిహెచ్ఒ వెంకటరామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్ నాగరాజా, వెంకటేశ్వరరావు, ఎపిహెచ్ఒ రెడ్డప్ప , పిహెచ్ఎం సుబ్బరత్న పాల్గొన్నారు. **ములకలచెరువు:** మండలంలోని పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు మింగిం చారు. మండలంలో 6754 మంది విద్యార్థులు ఉండగా 6532 మంది విద్యార్థులకు ఆల్బెండజల్ మాత్రలను సరఫరా చేశారు. మండలంలోని 16 గ్రామ పంచా యతీలలోని ప్రభుత్వ పాఠశాలలు, బురకాల కోట వద్ద గల బాలికల గురుకుల పాఠశాల, ములకలచెరువులోని కస్తూరిబా బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను సరఫరా చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభాగ్యులను ఆదుకోండి

- అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య
- అనాథలుగా మారిన భార్య, నలుగురు ఆడపిల్లలు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


పిల్లలతో ఈశ్వరమ్మ

ప్రజాశక్తి-గాలివీడు

పంట సాగు చేసి నాలుగు రూకలు సంపాదించుకోవచ్చనే ఆశ ఆ రైతును అప్పుల ఊబిలోకి నెట్టింది. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై భార్య, నగులురు ఆడపిల్లలను అనాథగా వదలి గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసలే పేదరికం..అప్పుల భారం మరో వైపు..ఆడపిల్లలను ఎలా పోషించుకోవాలో తెలియక సాయం చేసే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది ఆ తల్లి. వివరాల్లోకి వెళితే..గాలివీడు మండలం కొర్లకుంట గ్రామం, రెడ్డివారిపల్లికి చెందిన శంకర్, ఈశ్వరమ్మ భార్యభర్తలు. వీరికి నిహారిక, రోహిణి, మనోక్ష, సహస్ర నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. పెద్దకుమార్తె నిహారిక 10వ తరగతి, రోహిణి 9వ తరగతి, మనోక్ష 4వ తరగతి చదువుతున్నారు. చివరి పాప సహస్ర పుట్టుకతోనే విభిన్న ప్రతిభవంతురాలు.నడవలేదు, మాట్లాడలేదు. రజన సామాజిక వర్గానికి చెందిన శంకర్ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అదే గ్రామంలోని గుడిసెలోళ్లపల్లికి చెందిన బండేరు చిన్నరెడ్డి అనే వ్యక్తి భూమిని కౌలుకు తీసుకొని అప్పు చేసి వరి, వేరుశనగ, టమోటా పంటలను సాగు చేశారు. పంట చేతికి అందే సమయానికి దిగుబడి రాక అప్పుల పాలయ్యాడు. చేసిన అప్పు తీర్చాలనే ఉద్దేశంతో గొర్రెలు, గెదేలు కొని వాటిని పోషించి వాటిని విక్రయించగా వాటి ద్వారా కూడా నష్టాన్ని చవిచూశాడు.వ్యవసాయానికి, పాడిపశువుల పెంప కానికి చేసిన అప్పులు రూ.8లక్షలు వరకు చేరింది. అప్పులు భారం ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఈ సందర్భంగా మృతుడి భార్య ఈశ్వరమ్మ మాట్లాడుతూ తమను ఆదుకునే వారే లేరని, కుటుంబానికి ఆసరాగా ఉన్న భర్త ఆత్మహత్య చేసుకోవ డంతో నలుగురు ఆడ పిల్లలను ఎలా పోషించుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తమకు స్థిర, చర ఆస్తులు లేవని కటిక పేదరికంతో బాధపడుతున్నామని చెప్పారు. మా ధీన స్థితిని చూసి ప్రభుత్వం, దయగల హృదయులు ఆదుకోవాలని ముకులిత హస్తాలతో వేడుకుంది.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మదనపల్లి సబ్ కలెక్టర్ కల్యాణి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామీణ ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఆదేశించారు. మంగళవారం ఆమె సిహెచ్‌సి ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. స్త్రీల వార్డు, ఫార్మసీ గది, పరిశీలించారు. వైద్య సేవలు అందుకుంటున్న రోగులను వార్డును పరిశీలించారు. అనంతరం డాక్టర్లు పనితీరు సిబ్బంది పనితీరు పనితీరుపై డాక్టర్ సమరసింహారాజును అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఆరా తీశారు. విధినిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. సబ్‌కలెక్టర్ వెంట డిటి నవీన్, ఆర్ఐ ముద్దుకృష్ణ, ఎంయు త్యాగరాజు, హెడ్ సిస్టర్ గ్లోరీ లిటిల్ ఫ్లవర్ ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ

ములకలచెరువు : ములకలచెరువు తహశీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లి సబ్ కలెక్టర్ కల్యాణి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విఆర్ ఒలకు రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు సలహాలు సూచనలు అందించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే రైతులు సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, విఆర్ఒలు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ భావన, తహసిల్దార్ పీర్‌మున్నీ హెచ్చరించారు. మండల పరిధిలోని మందపల్లె గ్రామ పొలంలో సర్వేనెంబర్ 534లో కోటకొండ నరసయ్య 2.27 సెంట్లు, కోటకొండ ఉమ 1.60 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని భూమి చుట్టూ సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి దురాక్రమణకు పాల్పడు తుండగా సబ్ కలెక్టర్ ,తహశీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని పోలీసుల సహకారంతో స్తంభాలను తొలగించి దురాక్రమణను అడ్డుకున్నారు. ఆక్రమ ణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు మన్నారు రూరల్ పోలీస్ స్టేషన్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ భావన, తహశీ ల్దార్ పీర్ మున్నీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల జోలి కొస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారినైనా కఠిన శిక్షలు అమలు చేయబడతాయని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, మాదకద్రవ్యాలపై సిఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు. యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని,డ్రగ్స్ వినియోగం వల్ల ఆవ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని,మత్తులో నిద్రిస్తాడని ,క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఐసిటిసి ఆధ్వర్యంలో కృషి సంస్థ సహకారంతో హెచ్‌ఐవి ఎయిడ్స్ నిర్మూలన అవగాహన క్రమాన్ని మంగళవారం తంబళ్లపల్లె ఎంపిడిఒ కార్యాలయంలో ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎంపిడిఒ థామస్ రాజా లాంచనంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సెలర్ చంద్రమోహన్, బాలాజీ, వెలుగు సిసిలు రమణ, నరసింహులు, కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాయి బ్రాహ్మణులకి 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టిడిపి రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికారక సమితి నాయకులు మంగళ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక మదనపల్లె మార్కెట్ యార్డ్ ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకుందన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణ సోదరులకు కనీస వేతనం రూ.25 వేలకు పెంచి ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నాయి బ్రాహ్మణులు, అన్నమయ్య జిల్లా నాయి బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు చింతకుంట కేశవులు, రామకృష్ణ, మంజునాథ్, నారప పాండు పాల్గొన్నారు.


హనీఫ్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా షేక్ హనీఫ్

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి గ్రామ కమిటీ అధ్యక్షుడుగా షేక్ అనీఫ్ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటిస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక అజయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, వైసిపి బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. షేక్ హనీఫ్ మాట్లాడుతూ నూతన పదవికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి స్థానిక వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ అధ్యక్షులు నల్లారి తిమ్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు హనీఫ్‌ను సన్మానించారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్‌రాజు, నాగ తిరుమల రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐడెంటి కార్డు, టై, పాకెట్ బ్యాడ్జెస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ప్రశంసనీయమని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, సిఆర్‌పి శివ పాల్గొన్నారు.

ఎపిఎం కోసం పడిగాపులు

ప్రజాశక్తి-గుర్రంకొండ : ఎపిఎం కోసం డ్వాక్రా సభ్యులు పడిగాపులు కాసిన సంఘటన మండల కేంద్రం గుర్రంకొండలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ మండలంలోని విఒ3 క్రింద దౌలత్‌ఖాన్‌పల్లి, గాజుల వారిపల్లి, మద్దిరెడ్డిగారిపల్లి, తలారివాండ్లపల్లి, మజ్జిగవారిపల్లి సంబంధించిన 38 డ్వాక్రా సంఘాల్లో దాదాపు 380 మంది సభ్యుల ఉన్నారని తెలిపారు. సంఘమిత్రకు గత సంవత్సర కాలంగా ఎపిఎం ఎటువంటి పనులు చేయవద్దని చెప్పడంతో సంఘాలకు సంబంధించిన లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. మంగళవారం విఒ సర్వసభ్య సమావేశం ఉంటుందని సభ్యులు సంఘమిత్రతో పాటు సంబంధిత సిసి గంగులప్ప, ఎపిఎం రజినికి సమాచారం అందించారు. ఎంపిఎం వస్తున్నారని డ్వాక్రా మహిళలంతా ఉదయం నుండి సభ్యులు కార్యాల యం వద్ద వేచిఉన్నామని తెలిపారు. ఎపిఎం రాకపోవడంతో మండల కేంద్రం లోని గ్రామీణ బ్యాంకు వద్ద ఉందని తెలుసుకొని అక్కడి వెళ్లి మాట్లాడారు. మిమ్మల్ని సమావేశం ఎవరు పెట్టుకోమన్నారని, మీకేమి సంబంధం ఉందని ఎపిఎం ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. పోలీసులకు సమాచారమిచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. డ్వాక్రా సంఘాల లావాదేవీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ భావన రాక

ప్రజాశక్తి- పుల్లంపేట : తహశీల్దార్ కార్యాలయానికి బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్ భావన రానున్నట్లు తహశీల్దార్ పుల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధి లోని రైతులు వ్యవసాయ భూములకు సంబంధించి ప్రత్యేక రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమకు సంబంధించిన సమస్యల పట్ల అర్జీలు సమర్పించి మీ సమస్య లను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా : వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆటో బోల్తా పడటంతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. బొమ్మనచెరువు పంచాయతీ, టేకులపాళ్యం సమీపంలోని పందివానిపల్లికి చెందిన చిన్న పాపమ్మ (70) బొమ్మను చెరువు సచివాలయం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని మందబండ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో చిన్నపాపమ్మ తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ రామిరెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్న పాపమ్మ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన రామిరెడ్డిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కుటుంబ సమస్యలతో గొడవ పడిన మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితు రాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నీరుగట్టువారిపల్లి, మారుతినగర్‌కు చెందిన వెంకటేష్ భార్య కృష్ణమ్మ కుటుంబ సమస్యలపై గొడవ పడ్డారని తెలి పారు. తీవ్ర మనస్థాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని అన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే కిందికి దింపి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షిం చిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. బాధితురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో యువకుడి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను విడదీసారని, తీవ్ర మనస్థాపానికి గురైన కొత్త పెళ్లికొడుకు విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లి, యోగివేమన వీధికి చెందిన కొండారెడ్డి, సావిత్రమ్మ దంపతుల కుమారుడు భయ్యారెడ్డి ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక కొండామర్రిపల్లికు చెందిన రెడ్డప్ప, ప్రమీల దంపతుల కుమార్తె భవిత బిటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరూ ఇంటర్ చదివే సమయంలో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇద్దరు మేజర్ల కావడంతో తమకు పెళ్లి చేయాలని పెద్దలను ఆశ్రయించారు. ఇరువురు పెద్దలు ఇందుకు అంగీకరించకపోవడంతో ఇళ్ల నుంచి వెళ్ళిపోయి గురువారం కాణిపాకంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తాలూకా పోలీసులు భయ్యారెడ్డికి ఫోన్ చేసి నీపై ఫిర్యాదు వచ్చిందని, స్టేషన్ రావాలని పిలిచారు. అయితే తాను ఇష్ట ప్రకారమే భవితను పెళ్లి చేసుకున్నానని, మేమిద్దరము మేజర్లమని చెప్పారు. భవిత కూడా తనకు భయ్యారెడ్డి అంటే ఇష్టంతోనే పెళ్లి చేసుకున్నానని చెప్పింది. అయినా పోలీసులు ఓసారి స్టేషన్ రావాలన్నారు. ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని నమ్మ చెప్పారు. భయ్యారెడ్డి, భవితా దంపతులు మంగళవారం మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. ఈ దశలో పోలీసులు ఒకరొకరితో సపరేటుగా విచారించారు. భవితకు మరో ఏడాది ఉంటే బీటెక్ పూర్తవుతుందని, ఆ తర్వాత మీ ఇద్దరికీ పెద్దల సమక్షంలో పెళ్లి చేస్తామని చెప్పారు. అయినా ఇద్దరు అంగీకరించకపోయినప్పటికీ బలవంతంగా భవితను వారి తల్లిదండ్రులతో పంపించేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన భయ్యారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రయివేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.